క్లుప్తంగా

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బొండపల్లి: ముక్కనుమను పురస్కరించుకుని దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు దూసి శ్రీధర్ శర్మ భక్తులతో అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాభిషేకాలు చేయించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజపతినగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ శివకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గజపతినగరం టౌన్ పరిధి వరకు మాత్రమే విద్యుత్ సరఫరాకు రెండు గంటల పాటు అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

జామి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సబ్బవరపు అరుణ అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సతీష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

వల్లంపూడిలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి రజిని

వేపాడ: మండలంలోని వల్లంపూడి గ్రామంలో వేపాడ పీహెచ్‌సీ వైద్యులు, 104 సిబ్బంది సంయుక్తంగా మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్ర మం నిర్వహించారు. ముందుగా శిబిరం ఏర్పాటు చేసి ఓపీ(అవుట్ పేషెంట్) సేవలు అందించారు. వైద్యాధికారులు రాజు, రజినీ 87 మందికి శిబిరంలో వివిధ పరీక్షలు చేశారు. అనంతరం గ్రామంలో గృహసందర్శన చేసి ప్రజలకు వైద్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కోవిడ్ మళ్లీ వచ్చే ప్రమాదం ఉన్నందున గ్రామాల్లో తీర్థమహోత్సవాల్లో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీహెచ్ఓ ఆంజనేయులు, వైద్య సిబ్బంది కోమలి, వెంకటలక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిద్దాం



డస్ట్‌బిన్‌లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ భాస్కరరావు

గుర్ల: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని చింతలపేట సర్పంచ్ పతివాడ భాస్కరరావు అన్నారు. పంచాయతీ నిధులతో సమకూర్చిన డస్ట్‌బిన్‌లను చింతలపేట గ్రామంలో ప్రతీ ఇంటికి రెండు చొప్పున మంగళవారం ఆయన పంపిణీ చేశారు. చెత్తను కాలువలు, వీధుల్లో పారబోయకుండా డస్ట్‌బిన్‌లలో వేసి రోజూ ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్‌అంబాసిడర్లకు అందించాలని గ్రామస్తులకు సూచించారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

నెల్లిమర్ల రూరల్: సమాజ హితం ఆకాంక్షిస్తూ మండలంలోని దన్నానపేట జంక్షన్ సమీపంలోని ఇమ్మానుయేల్ చర్చిలో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్వమానవాళి బాగు కోసం ప్రతిఒక్కరూ ఏసుప్రభువుని ప్రార్థించాలని మతపెద్దలు అన్నారు. భగవంతుని నామస్మరణతోనే మానవునికి మనశ్శాంతి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు మాతా కుమార్, ఎలీషా సత్యనారాయణ, చంటి పాల్గొన్నారు.

గ్రామాల్లో తీర్థాల సందడి



శృంగవరపుకోట: మారుతీనగర్‌లో నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శనలో దౌడు తీస్తున్న ఎద్దు



గంట్యాడ: అమ్మవారి పూజల్లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య



లక్కవరపుకోట: రేగ గ్రామ సమీపంలోని కొండపై సీతారామలక్ష్మణుల దర్శనానికి వెళుతున్న భక్తులు



వేపాడ: ముకుందపురంలో విశేషాలంకరణలో జగన్నాథస్వామి



వేపాడ: వల్లంపూడి రామాలయంవద్ద భజన చేస్తున్న భక్తులు

శృంగవరపుకోట: సంక్రాంతి సంబరం ముగిసి.. తీర్థాల సందడి మొదలయ్యింది. ఎస్.కోట నియోజకవర్గంలో భోగి నుంచి గ్రామాల్లో ప్రధానంగా తీర్థ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. ఈ తీర్థాలు ప్రాంతాల వారీగా ఏప్రిల్‌లో ఉగాది వరకు జరుగుతుంటాయి. ఎస్.కోట మండలంలో ధర్మవరం పంచాయతీ శివారు మారుతీనగర్ గ్రామంలో గ్రామదేవత అంకమ్మపేరంటాల తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు భాజాభజంత్రీలతో అమ్మవారికి పసుపు,కుంకుమ, చీర,సారెలు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన ఎడ్ల పందాల్లో పలు గ్రామాలకు చెందిన ఎడ్లు దౌడు తీస్తూ ఆకట్టుకున్నాయి. గెలిచిన ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు ఇచ్చారు.

వేపాడ మండలంలో..

వేపాడ: మండలంలోని ముకుందపురంలో జగన్నాథస్వామి, వల్లంపూడి గ్రామంలో సీతారాముల తీర్థ మహోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. తీర్థమహోత్సవం సందర్భంగా నిర్వాహకులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

జామి మండలంలో ..

జామి: మండలంలోని ఎం.కె.వలస, శిరికిపాలెం, చింతాడ గ్రామాల్లో కన్నమ్మతల్లి, కొత్తమ్మతల్లి, మల్లికార్జునస్వామి తీర్థ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలతో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ జాతర

గంట్యాడ: కొఠారుబిల్లి గ్రామంలో శ్రీ కనకదుర్గమ్మ తల్లి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులతో అర్చకులు అమ్మవారికి ప్ర త్యేక పూజలు చేశారు. గజపతినగరం ఎమ్మెల్యే బొ త్స అప్పలనరసయ్య అమ్మవారిని దర్శించుకున్నా రు. ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు ఉన్నారు.

గృహలింగేశ్వరస్వామి తీర్థం

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామ సమీపంలోని కొండవద్ద ఉన్న గృహలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం తీర్థమహోత్సవం ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్క గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి కొండదిగువన ఉన్న గృహలింగేశ్వరస్వామిని, అలాగే కొండపైన ఉన్న శ్రీసీతారామలక్ష్మణ స్వామివార్లను దర్శించుకున్నారు. తీర్థం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చుట్టుపక్క గ్రామాలకు చెందిన తోమడు పెద్దలను ప్రత్యేకంగా అలంకరించి కొండ వద్దకు తీసుకొచ్చి భజనలు చేశారు.



జామి: ఎం.కె.వలసలో కన్నమ్మతల్లి తీర్థమహోత్సవంలో భక్తులు



జామి: శిరికిపాలెంలో పూజలందుకుంటున్న కొత్తమ్మతల్లి

వస్త్రాలు, డ్రమ్ముల పంపిణీ



డ్రమ్ములు, వస్త్రాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లిరూరల్: సంక్రాంతి సందర్భంగా మండలంలోని చిననడిపల్లి గ్రామంలో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ గడే సత్యవతి, మోహన్‌రావు దంపతులు సుమారు రూ. 2లక్షల విలువైన వాటర్ డ్రమ్ములు, వస్త్రాలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, పార్టీ మండల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్, ఎంపీటీసీ కరిమజ్జి శ్రీనివాసరావు సర్పంచ్ దంపతులను అభినందించారు. రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు,ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కృషితో గ్రామంలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పూర్తయిందని, తాగునీటిని వృథా కాకుండా నిల్వ చేసుకోవడానికి వీలుగా సర్పంచ్ దంపతులు తమ సొంత నిధులతో డ్రమ్ములు కొనుగోలు చేసి అందించడం అభినందనీయమన్నారు. నాయకులు కృష్ణ, మురళి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బొండపల్లి: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని ఎస్‌ఐ ఎస్.రవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండగకు పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చిన వారంతా తిరుగు పయాణం అవుతున్న నేపథ్యంలో..ఆటోలు, ఇతర ప్రైవేటు ప్రజారవాణా వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే సంబంధిత వాహన డ్రైవర్లపై చర్యలు తప్పవని పేర్కొన్నారు. అలాగే ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

వనమిత్రకేంద్రంలో పూలమొక్కల విక్రయం



విక్రయానికి సిద్ధంగా ఉంచిన వివిధ రకాల పూల మొక్కలు

బొండపల్లి: స్థానిక వనమిత్ర కేంద్రంలో అటవీశాఖ అధికారులు వివిధ రకాల పూలమొక్కల విక్రయాన్ని ప్రారంభించారు. జిల్లా వెలుగు సమాఖ్య నుంచి మొక్కలను కొనుగోలు చేసి వాటిని ఇక్కడి ప్రజలకు తక్కువ ధరకు విక్రయించే ఏర్పాట్లు చేశారు. రూ.100 నుంచి రూ. 300 విలువ చేసే వివిధ రకాల హైబ్రిడ్‌తో పాటు దేశవాళీ రకాలకు చెందిన మేడలపై, పెరటి తోటల్లో పెంచుకునేందుకు అనువైన మొక్కలతో పాటు వివిధ వేడుకలకు బహుమతులుగా ఇచ్చే పూల మొక్కలను అందుబాటులో ఉంచామని వనమిత్ర కేంద్రం సహాయ కులు పి.అప్పలనాయుడు తెలిపారు.

తిరుగు పయనం



గజపతినగరం జంక్షన్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



గజపతినగరంలో ప్రయాణికుల రద్దీ

గజపతినగరం: సంక్రాంతి పండగకు పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చిన వారు పండగ ముగించుకుని మంగళవారం తిరుగు పయనమయ్యారు. గజపతినగరంలోని జాతీయ రహదారి జంక్షన్ వద్ద ప్రయాణికుల బస్సుల కోసం పడిగాపులుకాశారు. గజపతినగరం మీదుగా సాలూరు నుంచి విశాఖపట్నం, పార్వతీపురం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. గజపతినగరం జంక్షన్‌లో ఉన్న ప్రయాణికులకు బస్సులో నిల్చుని ప్రయాణం చేసేందుకు కూడా చోటు లేక నానా అవస్థలు పడ్డారు. బస్సులు ఖాళీ లేకపోవడంతో కొంతమంది విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు ఆటోలను కట్టించుకుని వెళ్లాల్సి వచ్చింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బొండపల్లి: బొండపల్లి ఉన్నత పాఠశాల 2000-2001 బ్యాచ్ విద్యార్థులు

బొండపల్లి: స్థానిక ఉన్నత పాఠశాలలో 2000–2001లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల్లో సుమారు 50 మంది ఆత్మీయ సమ్మేళ నం పేరిట అదే పాఠశాల వేదికగా మంగళవారం కలుసుకున్నారు. ఒకరినొ కరు ఆప్యాయంగా పలకరించుకుని, చిన్ననాటి జ్ఞాపకాల ను గుర్తు చేసుకోవడంతో పాటు కుటుంబ జీవితం గురించి పరస్పరం తెలుసుకున్నారు. పాఠశాల మొత్తం కలియతిరిగి రోజంతా అక్కడే ఉండి సందడిగా గడిపారు. ఇక నుంచి ప్రతి ఏటా కలుసుకోవాలని తీర్మానించుకున్నారు.

15 ఏళ్ల తర్వాత...

లక్కవరపుకోట: మండలంలోని గంగుబూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007–08లో 10వ తరగతి చదువుకున్న వారంతా అదే బ్యాచ్ పూర్వ విద్యార్థి పూడి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం పేరిట పాఠశాల వేదికగా మంగళవారం కలిశారు. 15 ఏళ్ల క్రితం కలిసి చదువుకుని ప్రస్తుతం ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఇన్నాళ్లకు కలుసుకోవడంతో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రతీ ఏడాది ముక్కనుమ రోజును అంతా కలుసుకుందామని తీర్మానించుకున్నారు.



లక్కవరపుకోట: గంగుబూడి హైస్కూల్ 2007-08 బ్యాచ్ విద్యార్థులు

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

- గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలో 13,564 ఎకరాల్లో అపరాల సాగు
- మారుతున్న వాతావరణ పరిస్థితులతో ఆశిస్తున్న తెగుళ్లు

బొండపల్లి: అపరాల పంటలను ఆశించే తెగుళ్లను సకాలంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్ రైతులకు సూచిస్తున్నారు. గజపతినగరం సబ్ డివిజన్ పరిధి రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లలో వరికోతల అనంతరం పెసర,మినుము పంటలను సాగు చేస్తుంటారు. తక్కువ పెట్టుబడి, నీటితడులతో అపరాల పంటలను సాగు చేయవచ్చని రైతులు చెబుతున్నారు. గజపతినగరం సబ్‌డివిజన్ పరిధిలోని మెంటాడ,గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాల్లో 13, 564 ఎకరాల్లో ప్రస్తుతం పెసర, మినుము పంటలు సాగులో ఉన్నాయి. ప్రసుత్తం ఈ పంటలు పూత,పిందె దశలో ఉన్నాయి. మరో పది, పదిహేను రోజుల్లో పూర్తిస్థాయిలో పూత, కాయలు వచ్చే అవకాశం ఉంది. అయితే మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల తేమ ఎక్కువగా ఉండడంతో పంటలను మారుక మచ్చల తెగులు, బూడిద తెగులు, మచ్చల తెగులు, పల్లాకు తెగులు ఆశిస్తున్నాయి. ఈ తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు పాటించాలని వ్యవసాయ అధికారులకు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

తెగుళ్ల గుర్తింపు, నివారణ చర్యలు

అపరాలను విత్తిన 30 నుంచి 40 రోజుల వ్యవధిలో పంటను బూడిద తెగులు ఆశిస్తుంది. గాలిలో తేమ ఎక్కువగా ఉంటే ఆకులపై బూడిద రూపంలో చిన్న, చిన్న మచ్చలు వస్తాయి. క్రమేణా ఇవి పెద్దవిగా మారుతాయి. చెట్టు దిగువ భాగాలకు, కాయలకు తెగులు వ్యాపిస్తుంది. నివారణకు లీటర్ నీటికి మిల్లీ లీటర్ ప్రొఫికొనజోల్ మందుతో పాటు 13:0:45 పోషక ఎరువును 5 గ్రాముల కలిపి ఎకరానికి 200 లీటర్ల ద్రావణం పిచికారీ చేసుకోవాలి. అలాగే మారుక మచ్చల పురుగు పంటను పూత ,పిందె దశలో ఎక్కువగా ఆశిస్తుంది. లేత పూతను, పిందెలు,కాయలను పురుగు గూడుగా చేసుకుని కాయ అడుగు భాగాన రంధ్రం చేసి లోపలి గింజలను తినేసి కాయను డొల్ల చేసేస్తుంది. దీని నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ పురుగు మందును లీటర్ నీటికి 0.4 గ్రాములు కలిపి పిచికారీ చేయడం ద్వారా నివారించవచ్చు. అలాగే పోషక ఎరువులను పురుగు మందులతో కలిపి పిచికారీ చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు.



బూడిద తెగులు ఆశించడంతో పెసర పంటలో ఆకులపై ఏర్పడిన మచ్చలు



పూత, పిందెను ఆశించిన మారుక మచ్చల తెగులు

అధికారుల సూచనలను పాటించాలి



అపరాలు సాగుచేస్తున్న రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించడం వల్ల తెగుళ్లను సకాలంలో నివారించడంతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం వాతావరణంలో తేమశాతం పెరగడంతో తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉంది. తెగుళ్లను గుర్తించడం, నివారణపై రైతులకు అవగాహన కల్పించేందుకు పొలంబడి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

– కె.మహరాజన్. గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ

ప్రగతి పథంలో పురిటిపెంట



రైల్వేకాలనీలో పూర్తయిన సీసీ కాలువ నిర్మాణం



పాత పురిటిపెంటలో నిర్మాణం పూర్తయిన కాలువ చుట్టూ జేసీబీతో మట్టిని పూడ్చుతున్న దృశ్యం



ప్రాథమిక పాఠశాలకు నిర్మించిన ప్రహరీ

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సహాయ సహకారాలతో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. కేవలం గత నెల రోజుల వ్యవధిలోనే రూ.20.20 లక్షలతో గ్రామంలో మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు చేపట్టామని,సర్పంచ్ విజయలక్ష్మి, వైస్‌సర్పంచ్ మండల సురేష్ చెబుతున్నారు. గ్రామంలోని రైల్వే న్యూకాలనీలో రూ.3 లక్షలతో, విశ్వేశ్వరరావు లాయర్ వీధిలో రూ.2 లక్షలతో సీసీ కాలువల నిర్మాణం, న్యూకాలనీలో రూ.3.50లక్షలతో కల్వర్టు, రూ.2.70 లక్షలతో హెల్త్ వెల్ నెస్ సెంటర్‌కు ప్రహరీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రూ.4 లక్షలతో ప్రహరీ నిర్మించినట్లు సర్పంచ్, వైస్ సర్పంచ్ చెప్పారు. అలాగే రూ.3 లక్షలతో రోడ్డు, సంతతోట వీధిలో తాగునీటి మోటారు, పైపులైన్ల మరమ్మతులు చేపట్టారు. రూ.2లక్షలతో ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం) ఆధునికీకరణ చేయించారు.

'సాధనా' సభ్యుల ఔదార్యం



దాతలకు డోనర్ కార్డులు అందజేస్తున్న సాధనా యువజన సంఘం ప్రతినిధులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన సాధనా యువజన సంఘ సభ్యులు రక్తం అత్యవసరమైన ఓ గర్భిణికి రక్తదానం చేసి, ఔదార్యం చాటుకున్నారు. భోగాపురం మండల కేంద్రానికి చెందిన కె.వి.శ్వేత అనే గర్భిణి ప్రసవం నిమిత్తం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం చేరారు. ఆమెకు అరుదైన ఓ నెగిటివ్ రక్తం ఎక్కించాల్సి వచ్చింది. శ్వేత బంధువులు సాధనా యువజన సంఘం ప్రతినిధులను సంప్రదించగా, నేవీలో పనిచేస్తున్న కంటుభుక్త నాగరాజు, ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేస్తున్న మాషాడ సురేష్ రక్తదానానికి ముందుకువచ్చారు. పండగ నిమిత్తం సొంత గ్రామం జరజాపుపేటకు విచ్చేసిన వారిద్దరూ విజయనగరంలోని ఎస్.వి.ఎస్ బ్లడ్ బ్యాంకుకు వెళ్లి, రక్తదానం చేశారు. రక్తదాతలను గర్భిణి బంధువులు, సాధనా ప్రతినిధులు, స్థానిక పెద్దలు అభినందించారు.